నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

కరీంనగర్ కార్పొరేషన్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తాగునీటికి సాగు, సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్లోని జల సౌధ లో ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో ఆయన సమావేశమయ్యారు. జిల్లా అభివృద్ధి, పెండింగ్ పనులపై చర్చించారు. జిల్లాలో సాగునీటి సమస్యపై నేతలు ఉత్తమ్ దృష్టికి తీసుకెళ్లారు. అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు రాకపోవడంతో చాలా పనులు పెండింగ్ లోనే ఉన్నాయన్నారు. దీనికి స్పందించిన ఉత్తమ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.5 కోట్ల చొప్పున నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఇందులో సగం నిధులు సాగు, తాగునీటి కోసం వెచ్చించాలన్నారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్ల చొప్పున నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాస్త కష్టపడితే పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి విజయం సాధించేవాడని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి , ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం నియోజకవర్గ ఇన్‌చార్జిలు పురుమల్ల శ్రీనివాస్, వొడితల ప్రణవ్, జువ్వాడి నర్సింగరావు పాల్గొన్నారు.



జిల్లా నేతలతో సమావేశమైన ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు తదితరులు

వందశాతం పన్ను వసూలు చేయండి

- నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్

కరీంనగర్ కార్పొరేషన్: ఆస్తి పన్ను వసూలు వందశాతం పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్ పేయ్ ఆదేశించారు. శుక్రవారం బల్దియా కార్యాలయంలోని సమావేశ మందిరంలో డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆర్థిక సంవత్సరం మరికొద్ది రోజుల్లో ముగియనున్నందున ఆస్తిపన్ను వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. వార్డు అధికారులు తమకు కేటాయించిన డివిజన్‌లలో ఆస్తి పన్ను వసూలు చేసి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. రోజూ ఉదయమే క్షేత్రస్థాయికి వెళ్లి ప్రతీ ఇంటి నుంచి పన్ను వసూలు చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ శాఖలు, అపార్ట్‌మెంట్లు, హోటల్స్, రెస్టారెంట్లు, ఫంక్షన్‌హాల్, హాస్పిటల్స్ కు సంబంధించిన పన్ను వసూలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మొండి బకాయిదారులకు రెవెన్యూ రికవరీ ఆక్ట్ కింద నోటీసులు ఇవ్వాలని పేర్కొన్నారు. రూ.50 వేల కంటే ఎక్కువ పన్ను బకాయి ఉన్నవారిపై దృష్టి పెట్టాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం రూ.15 కోట్ల ఆస్తి పన్ను వసూలయ్యేలా చూడాలన్నారు. ప్రజలు కూడా సకాలంలో పన్ను చెల్లించాలన్నారు. వార్డు అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్

సెలవులో కమిషనర్

నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్ సెలవుపై వెళ్లారు. శనివారం నుంచి ఈనెల 14వ తేదీ వరకు ఆమె వ్యక్తి గత కారణాలతో సెలవు పెట్టారు. 15న తిరిగి విధుల్లో చేరనున్నట్లు సమాచారం. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

రాయితీని వినియోగించుకోవాలి

- సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి

కరీంనగర్‌కార్పొరేషన్: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 25 శాతం రాయితీని వినియోగించుకోవాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సుడా కార్యాలయంలో మాట్లాడారు. ఈనెల 31లోగా ఆన్లైన్లో ఫీజు చెల్లిస్తే 25 శాతం రాయితీ పొందగలుగుతారని తెలిపారు. జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్, సుడా, ఇతర మున్సిపాలిటీల్లో అన్నీ కలిపి 44,437 దరఖాస్తులకు ఫీజు నిర్ణయించబడిందని వెల్లడించారు. ఫీజు ఖరారు కానీ 1,435 దరఖాస్తులు నిషేధిత జాబితాలో లేకుంటే మళ్లీ ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ దరఖాస్తులను తిరిగి పరిశీలించడం జరుగుతుందన్నారు. 10 శాతం ప్లాట్లు మాత్రమే విక్రయించిన వెంచర్‌దారులకు మిగతా ప్లాట్లకు కూడా ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. దరఖాస్తుదారులకు ఏవైనా సందేహాలు ఉంటే 96524 04978, 70937 50333 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో సుడా వైస్ చైర్మన్, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, సీపీవో ఆంజనేయులు, ఫీల్డ్ అధికారులు అజయ్ రెడ్డి, సంపత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



డిబేట్‌లో పాల్గొన్న విద్యార్థులు

కరీంనగర్‌సిటీ: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ప్రభుత్వ మహిళ డిగ్రీ, పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ డా. వరలక్ష్మి అన్నారు. జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా జీవశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా సాధికారత, లింగ వివక్ష అంశంపై డిబేట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జాతీయ దినోత్సవమే కాకుండా ప్రతి రోజు మహిళలకు ప్రత్యేకమైన రోజే కావాలని సూచించారు. అనంతరం డిగ్రీ, పీజీ విద్యార్థినులు రెండు గ్రూపులుగా మారి డిబేట్ నిర్వహించారు. మహిళాహక్కులు, సమాజంలో మహిళలపై జరుగుతున్న అన్యాయాల గురించి చర్చించారు. కళాశాల కోఆర్డినేటర్, జీవశాస్త్ర విభాగాధిపతి మనో జ్‌కుమార్, డాక్టర్ విద్యా, అధ్యాపకులు డాక్టర్ సు జాత, ఆర్ రేఖరాణి, బి.ప్రియాంక, అనిత, రత్నప్ర భ, రమ్య, రవళి కృష్ణ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి కూలర్లు అందజేత

కరీంనగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ అనాథలు- వికలాంగుల ఆశ్రమానికి రెండు బ్లూ స్టార్ కూలర్లు అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ డివిజనల్ మేనేజర్ ఎస్‌వీ ప్రసాద్‌రావు మాట్లాడుతూ, సామాజిక బాధ్యతతో ఇలాంటి గొప్ప కార్యక్రమాలు చాలా సంవత్సరాలుగా చేస్తున్న యూనియన్ మహిళా విభాగాన్ని అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని, దీనికి యాజమాన్యం తరఫున మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. మహిళా విభాగం కన్వీనర్ వాణి మాట్లాడుతూ, 30 ఏళ్లుగా ప్రతీ మహిళా దినోత్సవం రోజున తమ వంతు బాధ్యతగా ఎంతో కొంత చారిటీ కార్యక్రమాన్ని నిర్వర్తిస్తున్నామని, దీనికి తోడ్పాటు అందిస్తున్న యూనియన్ నాయకులు, యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమం వార్డెన్ రాధిక, యూనియన్ నాయకులు రామ్మోహన్‌రావు, వామన్‌రావు, సూర్యకళ, బసవేశ్వర్, అనుపమ, శ్రీలత, సుధారాణి, శ్రీదేవి, శ్రీలత, డీవో యూనిట్ నాయకులు ప్రభాకరచారి తదితరులు పాల్గొన్నారు.



కూలర్లు అందజేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

పోస్టర్ ఆవిష్కరణ

విద్యానగర్: కరెన్సీ నోట్లపై అంబేద్కర్ చిత్రపటాన్ని ముద్రించాలనే డిమాండ్‌తో ఈనెల 26న ఢిల్లీలో కళాకారులచే ధూంధాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ పేర్కొన్నారు. శుక్రవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ధూంధాం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించినప్పుడే మన రాజ్యాంగాన్ని గౌరవించినట్లు అవుతుందన్నారు. ఈనెల 10 నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఈ విషయాన్ని ఎంపీలు ప్రస్తావించి కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. కార్యక్రమంలో ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళా మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు రామంచ భరత్, నాయకులు గట్టగల్ల సంజీవ, వొళ్ళల వాణి, మార్వాడి సుదర్శన్, బెజ్జంకి అనిల్, దండు అంజయ్య, కంచర్ల నవీన్, దండు వరలక్ష్మి, కలిగంగి మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: విద్యుత్ నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు టౌన్ 9 సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ 2 ఏడీఈ లావణ్య తెలిపారు. నగరంలోని కట్టరాంపూర్, వినాయక నగర్, గిద్దెపెరుమాండ్లస్వామి ఆలయం, గౌతమ్‌నగర్, హనుమాన్‌నగర్, ప్రొఫెసర్‌నగర్, తిరుమలనగర్, అల్కాపురికాలనీ, కోతిరాంపూర్, మెయిన్‌రోడ్, ఉజ్వలపార్కు, గణేశ్‌నగర్, బైపాస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సర్జన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్

కరీంనగర్‌టౌన్: అసోసియేషన్ ఆఫ్ శాతవాహన సర్జన్స్ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, సెక్రటరీగా డాక్టర్ వి.మంగిలాల్, ట్రెజరర్‌గా డాక్టర్ సాయిప్రసాద్‌ను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు సీహెచ్.రవీందర్‌రావు, వి.సూర్యనారాయణరెడ్డి, జి.ప్రశాంత్, జయరాం, బాస శంకర్, సీహెచ్.ప్రదీప్, అరుణ్, మోహనకృష్ణ, ప్రవీణ్, హరికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టడీ హాల్ ఓపెన్ చేయాలి



ధర్నా చేస్తున్న విద్యార్థులు

కరీంనగర్‌సిటీ: శాతవాహన యూనివర్సిటీలో స్టడీ హాల్‌ను ఓపెన్ చేయాలని అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ ఎదుట విద్యార్థుల ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, యూనివర్సిటీ విద్యార్థి వెంకటేశ్, రోహిత్ మాట్లాడుతూ, విద్యార్థులు రోజూ ఉదయం క్లాసుల తర్వాత స్టడీ హాల్‌కి వెళ్లి చదువుకుందామంటే నిబంధనలు పెట్టడం జరిగిందని, దీంతో విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు స్టడీ హాల్ సమయం సౌకర్యవంతంగా ఉండేలా కృషి చేయాలని కోరారు. అనంతరం వైస్ చాన్స్‌లర్ ఉమేశ్‌కుమార్ స్పందించి, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకెళ్లాలి



సెయింట్‌జాన్స్ కేబినెట్ లీడర్ల బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో సీఐ సృజన్‌రెడ్డి

కొత్తపల్లి: విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలని టూటౌన్ ఇన్‌స్పెక్టర్ సృజన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కరీంనగర్ జ్యోతినగర్‌లోని సెయింట్‌జాన్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో 2025–26 సంవత్సరానికిగాను ఎన్నికైన కేబినెట్ లీడర్స్ స్క్వాడ్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఆడపిల్లలు అనేక జాగ్రత్తలు తీసుకోవాలని, అనవసరమైన వాటికి ఆకర్షితులు కాకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సూచనలు తీసుకోవాలని చెప్పారు. పాఠశాల కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ విజయ, హెచ్ఎం రెవరెండ్ సిస్టర్ పి.ఇన్నాలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మార్సీలో మహిళా దినోత్సవం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్‌రూరల్ మండల వనరుల కేంద్రంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఎంఈవో కె.రవీందర్ తెలిపారు. మండల పరిధిలోని మహిళలు, అధికారులు, ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు.

సహకార సంఘాలకు ప్రత్యేక అధికారులు

శంకరపట్నం: మెట్‌పల్లి, గద్దపాక సహకార సంఘాల పదవీకాలం ముగియడంతో శుక్రవారం ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. సంఘం అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్ అశోక్‌కుమార్ మెట్‌పల్లి సహకార సంఘం ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించినట్లు సీఈవో సదయ్య తెలిపారు. గద్దపాక సంఘం ప్రత్యేక అధికారిగా చారి బాధ్యతలు చేపట్టినట్లు సీఈవో శ్రీనివాస్ పేర్కొన్నారు.



కరీంనగర్ కార్పొరేషన్: కరీంనగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఇసుక కుప్పలు సమస్యగా మారాయి. నిత్యం ప్రజలు వివిధ పనుల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వస్తుంటారు. కార్యాలయం ఎదుట ఇసుక పెద్ద కుప్పలుగా ఉండడంతో నడవడానికి కూడా ఇబ్బందిగా మారింది. ఎన్నిసార్లు ఇసుకను తొలగించాలని కోరినా సిబ్బంది పట్టించుకోవడం లేదు. అధికారులు చర్యలు తీసుకొని ఇసుక కుప్పను తొలగించి, సందర్శకుల ఇబ్బందులను దూరం చేయాలి.

– అలీ, ఖాన్‌పుర, కరీంనగర్

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
నరేందర్, అర్బన్ తహసీల్దార్ 96769 93266

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 94400 77555

దివాలకోరు మాటలు మానుకోవాలి

- మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్‌టౌన్: బీజేపీ, బీఆర్ఎస్ కలిస్తేనే బీజేపీ గెలుపు సాధ్యమైందని, అందుకే తాము ఓడిపోయామనడం మంత్రి పొన్నం ప్రభాకర్ రాజకీయ దిగజారుడు తనానికి నిదర్శనమని బీజేపీ నేత, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు విమర్శించారు. శుక్రవారం కరీంనగర్‌లో మాట్లాడారు. మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో ఎన్నికలు జరిగితే అభ్యర్థులను పోటీలో పెట్టలేని దివాలాకోరు స్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని పోటీలో పెట్టి అన్ని రకాల ప్రయోగాలు చేసి, మూడు సభల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారం చేసినా కాంగ్రెస్ ఓడిపోయిందని ఎద్దేవా చేశారు. దీనికి కారణం ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించారని అర్థం చేసుకోవాలన్నారు. బీజేపీ ఎమ్మెల్సీలో గెలుపు సాధించింది అంటే బండి సంజయ్‌కుమార్ కృషి ఉందన్నారు. ఓటమిని కప్పి పుచ్చుకోవడానికి దివాలకోరు మాటలు మాట్లాడడం మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో నాయకులు కొండపల్లి సతీశ్, చంద్రమౌళి, లెక్కల వేణు, అనూప్, ప్రవీణ్, శ్రీనివాస్, మొండయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సునీల్‌రావు

దేశవ్యాప్తంగా ఎస్సీ సబ్‌ప్లాన్ చట్టం అమలు చేయండి

కరీంనగర్: దేశ వ్యాప్తంగా ఎస్సీ సబ్‌ప్లాన్ చట్టాన్ని అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్)జాతీయ కౌన్సిల్ సభ్యుడు బోయిని అశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 10,11,12వ తేదీల్లో వేములవాడలో జరిగే రాష్ట్ర స్థాయి సమావేశాలను జయప్రదం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ సంక్షేమం పేరిట గడిచిన ఏడు దశాబ్దాలుగా అనేక పథకాలు ప్రవేశపెట్టి ఎంతో గొప్పగా అమలు చేస్తున్నట్లు చెప్పినా ఈ వర్గాల్లో వెనకబాటుతనం, పేదరికం పోలేదని, ఇప్పటికీ సమాజంలో అత్యంత పేదరికం అనుభవించే వారే దళితులు అని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని తిరుపతి మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీలకు జనాభా నిష్పత్తి ప్రకారం నిధులు కేటాయించాలన్నారు. ఉపాధ్యక్షుడు గంగాధర రఘు, ఆఫీస్ బేరర్ ఖండే ఎల్లయ్య, నాయకులు కొంకటి మొగిలి, చంచల భీమయ్య, రమేశ్, మొగిలి, పరశురాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అశోక్

కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కరీంనగర్‌కార్పొరేషన్/విద్యానగర్: సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి మాట్లాడుతూ, కార్మికులకు రూ.26,000 కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేసవికాలం ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో కార్మికులు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. హరితహారం, వాటర్ వర్క్స్, శానిటేషన్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం సహాయ కమిషనర్ వేణుమాధవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్, రవీందర్, రాచ మల్లయ్య, కవ్వంపల్లి రవి, కమలమ్మ, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే కరీంనగర్‌లో ర్యాలీ నిర్వహించి ప్రెస్‌భవన్‌లో సమావేశమయ్యారు. మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళ కార్మికులు కేక్ కట్ చేశారు.

ఇటుకబట్టీలు తొలగించాలి

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ గ్రామంలోని ఇటుక బట్టీను తొలగించాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారికి శుక్రవారం గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. కమాన్‌పూర్‌లో పంట పొలాలకు ఆనుకొని ఉన్నందున బట్టీల నుంచి వచ్చే పొగ, దుమ్ము, ధూళితో తెగులు వచ్చి పంటలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. పొగతో పరిసరాల ప్రాంతాల చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర శ్వాస కోస వ్యాధులు, అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. ఇటుక బట్టీలపై పూర్తిస్థాయి విచారణ జరిపి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇద్దరికి గాయాలు

హుజూరాబాద్: పట్టణంలోని జమ్మికుంట రోడ్డులో శుక్రవారం అతివేగంగా వస్తున్న ట్రాక్టర్ రోడ్డు పక్కన ఆగి ఉన్న మోటార్ సైకిల్, పక్కనే ఉన్న పాఠశాల గోడను ఢీకొట్టింది. మోటార్ సైకిల్‌పై ఉన్న ఇదరికి గాయాలు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న సివిల్ జడ్జి వెంకటేశ్

కరీంనగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని అపూర్వ డిగ్రీ కళాశాల (బాలికల)లో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్ చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. ఎలాంటి న్యాయపరమైన సహాయాన్ని అందించడానికైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిద్ధంగా ఉంటుందని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, న్యాయవాది తణుకు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

యూనిసెఫ్ బృందం సందర్శన



స్వాగతం పలుకుతున్న అధికారులు, సిబ్బంది

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లి గ్రామాన్ని శుక్రవారం యూనిసెఫ్ ప్రతినిధి బృందం సభ్యులు సందర్శించారు. యూనిసెఫ్ ఢిల్లీ ప్రతినిధి బర్నాల్ ఘోష్, దక్షిణభారత్ హెడ్ వెంకటేశ్‌కు పంచాయతీ కార్యదర్శి కె.మహేందర్‌రావుతోపాటు పారిశుధ్య కార్మికులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో పర్యటించి పారిశుధ్యం, సెగ్రేషన్ షెడ్, నర్సరీ, విటమిన్ గార్డెన్‌లను సందర్శించారు. పారిశుధ్య కార్మికులు, వన సేవకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం యూనిసెఫ్, జిల్లా కలెక్టర్ సహకారంతో పారిశుధ్య కార్మికులకు అందిస్తున్న సేవలపై వీడియో చిత్రీకరించారు. కార్యక్రమంలో యూనిసెఫ్ రాష్ట్ర కోఆర్డినేటర్ ఫణి, జిల్లా కోఆర్డినేటర్ కిషన్‌స్వామి, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): జాతీయస్థాయి గణిత, సైన్స్ ఒలింపియాడ్, ఆల్ ఇండియా టాలెంట్ సెర్చ్ పరీక్షల్లో అల్ఫోర్స్ ఇ–టిక్నో స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ- టిక్నో స్కూల్‌లో ఏర్పాటు చేసిన సభలో విద్యార్థులను అభినందించారు. గణిత ఒలింపియాడ్‌లో జి.సహర్ష్, డి.చంద్రహాస్ (6వ తరగతి), కృష్ణ ప్రతీక్ (9వ తరగతి) బంగారు పతకం, ఇ.లిఖిత్‌కుమార్ (7వ), జి.హేమంత్ జాదవ్ (9వ) రజత, జి.సాయిసంహిత్ (8వ) బంగారు పతకంతోపాటు జాతీయస్థాయి 2వ ర్యాంకు సాధించారని తెలిపారు. సైన్స్ ఒలింపియాడ్‌లో డి.అనుశ్రీ (6వ), కృష్ణచైతన్య (7వ) బంగారు, జి.విభువన్‌రామ్ (4వ), కె.తనీశ్‌రెడ్డి (9వ) రజత పతకాలు సాధించారు. ఆల్ ఇండియా టాలెంట్ సెర్చ్ (ఏఐటీఎయస్ఈ)లో ఎన్.వినాయక్ (7వ), జి.సాయి సంహిత్ రజత పతకం సాధించినట్లు వివరించారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో బంగారు పతకం



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం ఆనందం

కొత్తపల్లి: జిల్లా విద్యాశాఖ, అల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన హమ్మింగ్‌బర్డ్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో కొత్తపల్లి మండలం ఎలగందుల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి ఆర్.రిషిత్ పటేల్ బంగారు పతకం సాధించినట్లు హెచ్ఎం ఆనందం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని శుక్రవారం అభినందించారు.

455 మంది గైర్హాజరు

కరీంనగర్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో శుక్రవారం 455 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జనరల్, ఒకేషనల్ విభాగంలో 18,222 మందికి 17767 మంది విద్యార్థులు హాజరయ్యారని వెల్లడించారు.

చర్య తీసుకోవాలి

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థ ఈఈ యాదగిరిపై దౌర్జన్యం చేసిన కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ ప్రకటనలో డిమాండ్ చేశారు. విధుల్లో ఉన్న ఒక దళిత అధికారిపై కాంట్రాక్టర్లు దౌర్జన్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. ఈఈకి రక్షణ కల్పించాలని, బాధ్యులైన కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.